కథ

# నేను చెడ్డవాడిని కాదు

- డా. తాడేపల్లి పతంజలి

మళ్ళీ ఫోన్ మోగింది.

ఈ సారి ఫోన్ ఎత్తాలంటే భయమేసింది.

"ఏంటండి...ఫోన్ తియ్యరు? అన్నిసార్లు మోగుతుంటే" వంటింటి నుంచి మా ఇంటి మహారాణి లలిత ఆజ్ఞ జారీచేసింది.

తప్పనిసరయి ఫోన్ ఎత్తాను.

"హలో...శ్రీనివాస రావుగారి మిసెస్ లలితగారేనా.....!" అవతలి నుంచి వినిపించింది.

నేను కాదు అని చెప్పబోయేటంతలోనే ఆయన అందుకున్నాడు. "నేనమ్మా...శ్రీనివాసరావుగారి డియరెస్ట్ ఫ్రెండ్ నవనీతరావుని. నాకు ఇప్పుడే తెలిసిందమ్మా... ఐయాం వెరీసారీ. శ్రీనివాసరావు మొన్న యల్ బి నగర్ దగ్గర జరిగిన యాక్సిడెంట్‌లో పోయాడటకదా! ఎక్కడో గుంటూరు జిల్లాలో మారుమూల పల్లెటూళ్ళో ఉంటున్నాను. వార్త కొంచెం ఆలస్యంగా తెలిసింది. ధైర్యంగా ఉండాలమ్మా. ఏం చేస్తాం అంతా దేవుని దయ..."

ఇక వినలేక ఫోన్ పెట్టేసాను. ఇలా ఈ రకమైన ఫోన్లు రావడం ఇది నాలుగోసారి.

శుభ్రంగా దుండుముక్కలా ఉన్న నేను చనిపోవటమేమిటి? ఈ వార్త ఎలా పాకింది?


"ఎక్కడ్నించండి ఫోన్?" లలిత ప్రశ్నించింది.

"మా ఫ్రెండ్ నవనీతరావు దగ్గర్నుంచి"

"అన్నయ్యగారా...చాలాకాలానికి గుర్తుకొచ్చామే...అందరూ బాగున్నారా?" లలిత అడిగింది.

అసలే ఈ రోజు శుక్రవారం. నవనీతరావు పరామర్శ విషయం చెబితే లలిత ఎలా రియాక్టవుతుందో.

"ఆ... ఆ... అందరూ బాగున్నారు కాని...నేనలా బయటికి వెళ్ళొస్తా. నేవొచ్చేంత వరకూ ఫోన్లేమి తీయకు. సిటీలో అంతా భయం భయంగా ఉంది. మొన్న బాంబ్ బ్లాస్టింగ్ జరిగింది కదా! ఖర్మకాలి... ఆ బాంబ్ బ్లాస్టింగ్ జరిగిన దానికి దగ్గరగానే మన ఇల్లు..పోలీసులు, టెర్రరిస్టులు అందరూ రకరకాల మారు పేర్లతో ఫోన్లు చేస్తుంటారు. నీకు ఎలా మాట్లాడాలో తెలియదు. నేను వచ్చిన తర్వాత తీస్తాలే..."



లలితతో చెప్పి బయటకు నడిచాను.

* * *

ప్రస్తుతం నేను ఉంటున్న ఊరికి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న నేను ఒకనాడు పనిచేసి, రిటైరయిన స్కూల్‌కి చేరాను. పెన్షన్ క్లారిఫికేషన్ కోసం ఒక కాగితం కావాలి.

స్కూల్ ఆవరణలో అడుగుపెట్టానో లేదే మైక్‌లో నుంచి మాటలు వినిపిస్తున్నాయి. "నిజంగా శ్రీనివాసరావుగారు చనిపోవటం చాలా బాధాకరమైన విషయం. నవ్వుతూ, నవ్విస్తూ మనందరి మధ్య మసలిన శ్రీనివాసరావుగారు ఈ స్కూలును విడిచిపెట్టి ఆరు నెలలయింది. ఈ లోకాన్ని బాంబ్‌బ్లాస్టింగ్‌లో మొన్న విడిచిపెట్టారట. వారి ఆత్మ శాంతి కోసమై రెండు నిమిషాలు మౌనం పాటించవలసినదిగా అందరినీ కోరుతున్నాను" హెడ్మాస్టర్ గణపతి కాబోలు ఆవేదనా పూర్వకంగా చెబుతున్నాడు.

స్కూలు టీచింగ్, నాన్‌టీచింగ్, పిల్లలు అందరూ అక్కడే ఉన్నట్టున్నారు.

బతికి ఉన్న నా ఆత్మ శాంతికోసం మౌనం పాటిస్తున్నారు. ఇక స్కూలు లోపలికి వెళ్ళబుద్ధి కాలేదు.

ఇంటికి వెళ్తూ నా భార్యకి స్వీట్ పాకెట్ తీసుకెళ్ళాను. "ఏంటండి.... విశేషం..." అంది లలిత. కాలర్ ఐడిలో నేను అటెండ్‌గాని మరో ఇరవై నంబర్లను లెక్కించి "నేను చెడ్డవాడిని కాదని తెలిసింది" అన్నాను. నా భార్య నా మాట అర్థంకాక తెల్లబోయి చూస్తోంది. ❑